రాష్ట్రంలో సంక్షేమ పాలన

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని, రాష్ట్రంలో ప్రజా రంజకంగా పాలన సాగిస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. బుధవారం బొడ్డపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, జగనన్న కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను సర్పంచ్ అంపోలు భాను, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుపతిరావు, ధర్మా రామకృష్ణ, గొల్లంగి హేమలత కోరారు. రోడ్లు, కాలువలు సచివాలయ నిధులతో పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. జగనన్న కాలనీకి సంబంధించిన విద్యుత్ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ, ఎంపీపీ వాన గోపి, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు పి.ముసలినాయడు, రాజప్పల నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, ఎం.శ్యామలరావు, మెండ కృష్ణ, పైడి విఠలరావు, బగ్గు లక్ష్మణరావు, వాన నాగేశ్వరరావు, మూకళ్ల సత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కలమటవి అర్థంలేని ఆరోపణలు



మాట్లాడుతున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎల్.ఎన్.పేట: రాజకీయంగా ఏదో ఒకటి మాట్లాడాలని, అధికార పార్టీ నాయకులపై అభాండాలు వేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో జరిగిన సమావేశంలో వీరు మాట్లాడారు. నిజాలు తెలుసుకుని కలమట మాట్లాడాలన్నారు. వంశధార నిర్వాసితుల కోసం ప్రభుత్వం రూ.216.72 కోట్ల నిధులు విడుదల చేసిందని, ఇందులో ఇప్పటివరకు నిర్వాసితులకు రూ.162 కోట్లు చెల్లించటం జరిగిందని అన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న రూ.26 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ చెల్లింపులకు సంబంధించి విచారణ పూర్తి చేసిన వెంటనే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమచేయటం జరుగుతుందన్నారు. మిగిలిన డబ్బుల కోసం దరఖాస్తుల చేసుకునేందుకు నిర్వాసితులు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఈ మూడున్నరేళ్లలో సుమారు రూ.వెయ్యి కోట్లు పాతపట్నం నియోజకవర్గానికి ఖర్చు చేశారని గుర్తుచేశారు. టీడీపీ పాలనతో గ్రామాల్లో వీధి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండేవని, ఇప్పుడు అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అధికారుల చుట్టూ తిరిగే పనిలేకుండా గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చిందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎక్కడా అన్యాయం జరుగలేదని, ఆర్‌బీకేల ద్వారా ప్రతీ గింజా కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు.

అభివృద్ధి కనిపించడం లేదా?



మాట్లాడుతున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుల

కొత్తూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ మూడున్నరేళ్లల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కనిపించడం లేదా అని కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యవతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు ప్రశ్నించారు. కుంటిభద్ర కాలనీలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. వేల కోట్లు నిధులు ఖర్చుతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, పాల కేంద్రాల నిర్మాణం అభివృద్ధి కాదా అని అన్నారు. పాతపట్నం నియోజవర్గంలో అలికాం బత్తిలి, పీహెచ్, కురిగాం–పొనుటూరు, బంకి, కడుము–దిమిలి బీటీ రోడ్లను అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ పాలనలో నిర్వాసితుల పేరు చెప్పి టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడిన విషయం అందరికీ తెలుసన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నిర్వాసితులకు అదనపు పరిహారం చెల్లించామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కామక త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మెళియాపుట్టి: రాష్ట్రప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కనిపించడంలేదా అని మెళియాపుట్టి జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్ ప్రశ్నించారు. బుధవారం మండల విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ప్రభుత్వం పెద్దలపై కలమట విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ టికెట్‌పై గెలిచి పార్టీ మారడంతోనే కలమట రాజకీయ జీవితం ముగిసిందన్నారు. జంపింగ్ ఎమ్మెల్యేగా ప్యాకేజీ తీసుకుని ఆయన బాగుపడ్డారని, నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. లోకేష్ పాదయాత్ర వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీలేదన్నారు. మండల నాయకులు పల్లియోగి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రాములమ్మ పేరంటాల యాత్ర



మండపం వద్ద అరటి గెలలు కట్టిన భక్తులు

నరసన్నపేట: గోపాలపెంటలో రాములమ్మ పేరంటాల యాత్ర బుధవారం సందడిగా జరిగింది. శాలింహుండం కొండపై వేణుగోపాలస్వామి యాత్ర పురస్కరించుకుని గోపాలపెంటలో ప్రతీ ఏటా రాములమ్మ పేరంటాల పేరున యాత్రను నిర్వహిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు యాత్రలో పాల్గొన్నారు. సాలిహుండం వేణుగోపాలస్వామిని దర్శించుకుని వచ్చి రాములమ్మ పేరంటాల వద్ద మొక్కులు తీర్చుకున్నారు. అరటి గెలలను నైవేద్యంగా ఇచ్చి చీరలు సమర్పించారు. అనంతరం యాత్రీకులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గోపాలపెంట సర్పంచ్ ఎండ కృష్ణవేణి, ఎంపీటీసీ గదిలి మల్లేశ్వరరావు, మాకివలసకు చెందిన శిమ్మ పాపినాయుడు, యాళ్ల వేణు, శిమ్మ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించిన సాయిప్రణీత్



సిల్వర్ మెడల్ సాధించిన సాయి ప్రణీత్

పాతపట్నం: జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాతపట్నం సెయింటిన్స్ స్కూల్ 6వ తరగతి చదువుతున్న కుంచపు సాయిప్రణీత్ రాణిస్తున్నాడు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్‌లో విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. గత నెలలో శ్రీకాకుళంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్‌తో సత్తా చాటాడు. సాయి ప్రణీత్‌కు సెయింట్స్ స్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు.

నిర్వాసితులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారంగా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఇప్పటికే 80 శాతం చెల్లింపులు పూర్తయ్యాయని, మిగిలిన వారికి పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హిరమండలం పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితులకు చెల్లింపులు జరగలేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆరోపణలు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. నిర్వాసితులకు సంబంధించిన చెల్లింపులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో వేసినట్లు గుర్తుచేశారు. గతం ప్రభుత్వ హయాంలో నిర్వాసితుల పేరుతో మంజూరు చేసిన నిధుల కోసం తప్పుడు పత్రాలు సమర్పించి బినామీ పేర్లతో టీడీపీ నాయకులే స్వాహా చేశారన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త భగవాన్

బూర్జ: వ్యవసాయం అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ హార్టికల్చర్ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.వి.కె.భగవాన్ అన్నారు. గురువారం తాను దత్తత తీసుకున్న బూర్జ గ్రామంలో పర్యటించి ఉద్యానవన పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. అరటి, టమాటా, బెండ, వంగ పంటలపై ఆసిస్తున్న చీడపురుగుల నివారణపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. రైతులు అధిక దిగుబడి పొందడానికి విత్తన దశలోనే నాణ్యమైనవి ఎంపిక చేసుకోవాలని, నాటే పద్ధతి, ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వాడకంపై సూచనలు చేశారు. ఏఓ రాజేశ్వరరావు, స్థానిక ఉద్యానవన శాఖాధికారి ఐయంతి, ఆర్‌బీకే సిబ్బంది, ల్యాబ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

మూగజీవాలకు టీకాలు

సరుబుజ్జిలి: గొర్రెలు, మేకలు చీడపారుడు వ్యాధికి గురికాకుండా రొట్టవలస గ్రామంలో బుధవారం టీకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు పశు సంవర్ధకశాఖ సహాయక సంచాలకులు సి.హెచ్.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ నెల చివరి వరకు అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామని వెల్లడించారు. స్థానిక సర్పంచ్ మూడడ్ల భద్రమ్మ, వైఎస్సార్‌సీపీ సచివాలయం కన్వీనర్ల మండల కో ఆర్డినేటర్ మూడడ్ల రమణ, మండల పశువైద్యాధికారి డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం చేపట్టిన నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని ఎంఈఓ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించి మిగిలిన పనులు సకాలంలో పూర్తి చేయించాల్సిన బాధ్యత గ్రామ సచివాలయ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులపై ఉందన్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాలలకు రక్షణ గోడల నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం

కొత్తూరు: స్థానిక వ్యవసాయ పరపతి సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని వరుసగా మూడోసారి చైర్మన్‌గా నియమితులైన చింతాడ సూర్యనారాయణ అన్నారు. చైర్మన్‌ను రైతులు బుధవారం సత్కరించారు. రైతులకు ఈ ఏడాది సకాలంలో విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశామన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–3 ఆర్‌ఆర్ కాలనీలో రాజా రాఘవ రామచంద్రస్వామి దేవాలయం ప్రతిష్ఠామహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 5 తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. మెట్టూరు ప్రధార వీధుల్లో తిరువీధి నిర్వహించారు. కొత్తూరుకు చెందిన కోలాట బృందం నృత్యం అందరినీ ఆకట్టుకుంది.

ఆధార్ కేంద్రం వినియోగించుకోవాలి

కొత్తూరు: మండలంలోని బలద గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని సర్పంచ్ సారిపల్లి భారతమ్మ, ఎంపీటీసీ సారిలప్లి ప్రసాదరావు బుధవారం ప్రారంభించారు. ఆధార్ కార్డులో తప్పులు, మార్పులు, చేర్పులు చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

కొత్తూరు: మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం వేకువ జాము నుంచి గ్రామ వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 10,856 మంది పింఛన్‌దారులు ఉండగా.. 9,253 మందికి పింఛన్‌లు అందజేశారు. పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ బి.లావణ్య పరిశీలించారు.

కిడ్నీ రోగికి పింఛన్ మంజూరు

బూర్జ: మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన భవిరిశెట్టి సంతోషి గత కొన్నేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు మంజూరైన పింఛన్ రూ.5 వేలను స్థానిక సర్పంచ్ జల్లు అంబుజాక్షి బుధవారం అందజేశారు. డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, మాజీ సర్పంచ్ జల్లు హైమావతి, మాజీ డీసీఎమఎస్ డైరెక్టర్ జల్లు కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

కొత్తూరు: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు అంధకారంగా మారుతాయని స్థానిక సీఐ ఆర్.వేణుగోపాలరావు అన్నారు. కొత్తూరులోని శ్రీవెంకటసాయి డిగ్రీ కాలేజీలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలు సేవించినా, అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు.

క్లుప్తంగా

3న ఉచిత వైద్య శిబిరం

నరసన్నపేట: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఈ నెల 3న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకరరావు, బి.మోహనరావు తెలిపారు. కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గుండె, కిడ్నీ వ్యాధులపై వైద్య శిబిరం ఉంటుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ సభ్యులు వచ్చి తనిఖీలు చేసుకోవచ్చన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: మండలంలో గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటిస్తున్నారని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రొట్టవలస, సరుబుజ్జిలిలో గృహసారథులు, సచివాలయం కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటారని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

రీ సర్వేతో మేలు



రీసర్వేను పరిశీలిస్తున్న ఎంపీపీ మురళి

నరసన్నపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. మండలంలోని సత్యవరం రూరల్‌లో రీ సర్వేను ప్రారంభించారు. రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. భూహక్కు దారులకు శాశ్వత స్థాయిలో హక్కు పత్రాలు వస్తున్నాయని, రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. దూకులపాడు సర్పంచ్ అల్లు అసిరినాయుడు, నరసన్నపేట పంచాయతీ వార్డు సభ్యుడు ఇప్పిలి నీలం తదితరులు పాల్గొన్నారు.

నేడు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ఆమదాలవలస రూరల్: మండలంలో హనుమంతుపురం, ఇసుకలపేట గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల నిర్మాణాలకు గురువారం స్పీకర్ తమ్మినేని సీతారాం శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

శ్రీముఖలింగంలో అఖండ నామ సంకీర్తన



పూజలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఒరియా వీధిలో భీష్మ ఏకాదశి పురస్కరించుకుని బుధవారం అఖండ నామ సంకీర్తన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు అర్చకులు స్వామి తీర్థ ప్రసాదాలు అందజేసి దీవించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పేదలు 500 మందికి దుప్పట్లు పంపిణీ చేపట్టారు. ఎంపీపీ వాన గోపి, మాజీ జెడ్పీటీసీ మెండ రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే కుష్టు వ్యాధి నిర్మూలన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస రూరల్: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ ఎన్ని రామచంద్రరావు అన్నారు. మండలంలో కట్యాచార్యులపేట గ్రామ పంచాయతీలో కుష్టు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని సూచించారు. కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్ములో వ్యక్తిపై దాడి

నరసన్నపేట: మండలంలోని జమ్ము గ్రామానికి చెందిన గొండు సూర్యనారాయణపై అదే గ్రామానికి చెందిన మొయ్యి శ్రీరాములు దాడి చేసి గాయపరిచాడు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సూర్యనారాయణ నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తనపై అకారణంగా శ్రీరాములు దాడిచేసి గాయపరిచినట్లు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి



పాతపట్నం: వేంకటేశ్వరాలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు



సరుబుజ్జిలి: రంగనాథుని కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: స్థానిక మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న వేంకటేశ్వర ఆలయానికి భీష్మ ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. బుధవారం తెల్లవారుజాము నుంచి బారులు తీరారు.

సరుబుజ్జిలి: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పురుషోత్తపురంలో రంగనాథ స్వామి ఆలయంలో స్వామి వారి దివ్య తిరుకల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. పూర్ణాహుతి, పలు పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారిని తిరువీధి ఉత్సవం చేపట్టారు.

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుని తిరువీధి ఉత్సవం భీష్మ ఏకాదశి పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను అలంకరించి పల్లకిలో ఆశీనులుగా చేశారు. తిరువీధి నిర్వహించి భక్తులు హారతులిచ్చారు.

కొత్తూరు: భీష్మ ఏకాదశి పురస్కరించుకుని కొత్తూరు, నివగాం, మాకవరం, మెట్టూరు, బలద, కడుము, సిరుసువాడతోపాటు పలు గ్రామాల్లోని ఆలయాల వద్ద భక్తులు వేకువజాము నుంచే పూజల కోసం బారులు తీరారు. కొత్తూరు సీతారామాలయం, వేంకటేశ్వర ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హరే రామ, అఖండ నామ సంకీర్తనను భక్తులు నిర్వహించారు.



జలుమూరు: ప్రత్యేక అలంకరణలో పార్వతీపరమేశ్వరులు



కొత్తూరు: కొత్తూరు సీతారామ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం



అద్దె బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంతో సురక్షితమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బుధవారం రెండు అద్దె బస్సులను ప్రారంభించారు. శ్రీకాకుళం–పాతపట్నం, శ్రీకాకుళం–పాలకొండ మధ్య నడవనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎంపీపీ ఆరంగి మురళి, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, మండల కో–ఆప్షన్ సభ్యుడు రమణ సాహు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుప్త, పాగోటి రాజారావు, బోయిన బాలకృష్ణ, కేశవరాజు తదితరులు పాల్గొన్నారు.

కాన్‌కాస్ట్ బాధితులను ఆదుకునేందుకు చర్యలు



సువ్వారి గాంధీతో మాట్లాడుతున్న కార్మికశాఖ జిల్లా అధికారులు

పొందూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దూసి కాన్‌కాస్ట్ కార్మికుల బకాయిలు, అలివెన్స్‌లు చెల్లింపులకు కార్మిక శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ హర్షం వ్యక్తం చేశారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ (విశాఖపట్నం) ఆదేశాల మేరకు జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్‌డీవీ ప్రసాదరావు, అసిస్టెంట్ కమిషనర్ అజయ్ కార్తికేయ బుధవారం మండలంలోని వీఆర్ గూడెం గ్రామంలో ఆయన స్వగృహంలో కలిసి చర్చించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో పరిశ్రమ మూసివేయడంతో పాటు, బకాయిలు కూడా చెల్లించకపోవడంతో సుమారు 700 మంది కార్మిక కుటుంబాలు, పరోక్షంగా వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కార్మికులంతా కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు సువ్వారి గాంధీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గాంధీ గత ఏడాది సెప్టెంబర్‌లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కార్మికుల దుస్థితిని తెలియజేసి పరిశ్రమను తెరిపించాలని వినతిపత్రాన్ని అందజేశారు. పరిశ్రమను మూసివేయడానికి ముందు 6 నెలలు బకాయిలు, అలవెన్స్‌లు కలిసి సుమారు రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉందని తెలిపారు. కొద్ది రోజుల్లో కార్మికులకు చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. సీఎం జగన్‌కు కార్మికుల తరఫున సువ్వారి గాంధీ ధన్యవాదాలు తెలిపారు. కాన్‌కాస్ట్ కార్మికులు ఆర్.వి.రాఘవేంద్ర, కూన శ్రీనివాసరావు, ఎల్.సత్యం, బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పద్ధతులు పాటిస్తే లాభదాయకం



బెల్లం తయారీపై రైతులకు సూచనలిస్తున్న ఏఓ మోహనరావు

ఆమదాలవలస రూరల్: బెల్లం తయారీలో నాణ్యమైన పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని మండల ఏఓ మెట్ట మోహనరావు సూచించారు. మండలంలో కొరపాం గ్రామంలో రైతులు స్వంతంగా గానుగలు ఏర్పాటు చేసుకుని తయారు చేస్తున్న బెల్లాన్ని బుధవారం పరిశీలించి, పలు సూచనలు అందజేశారు. చెరకు పంట సాగు చేసే రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎక్కువ మోతాదులో గెడలు లభ్యం అవుతాయని, దీనివల్ల బెల్లం దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందన్నారు. బెల్లం తయారుచేసే సమయంలో ఎటువంటి రసాయనాలు వేయకుండా తయారు చేస్తే ఎక్కువ కాలం నిల్వ చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో చెరకు పంటను సాగు చేసి బెల్లం తయారీ చేసే రైతులను టీటీడీకి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు బెల్లం విక్రయాలు చేసుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. ఇప్పటికే రైతులు గ్రూపులుగా ఏర్పడి బెల్లాన్ని టీటీడీకి విక్రయించేందుకు ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. చెరకు పంట సాగు చేసే రైతులు ఎరువులు కోసం రైతు భరోసా కేంద్రం వద్ద తమ వివరాలను నమోదు చేసుకుంటే ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ పరిశీలనలో కొరపాం, నిమ్మతొర్లాడ రైతులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్న వినోద్

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న కింజరాపు వినోద్ రాష్ట్ర స్థాయి అండర్ 19 స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి నరసన్నపేట ఖ్యాతిని ఇనుమడింప చేశాడు. ఈ పోటీల్లో వినోద్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు స్థానిక వీర హనుమాన్ వ్యాయామ శాల కోచ్ అప్పలరామయ్య తెలిపారు. పోలాకి మండలం కోరాడలచ్చయ్యపేటకు చెందిన వినోద్ ఇప్పటికే పలు పోటీల్లో పాల్గొని బహుమతులు పొందినట్లు వివరించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో ఉక్కు కళామందిర్ ప్రాంగణంలో ఈ పోటీలు జరిగినట్లు తెలిపారు. 62 కేజీల విభాగంలో స్నాచ్ 73 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 96 కేజీల బరువు ఎత్తి మొదటి స్థానం పొందినట్లు తెలిపారు. వినోద్‌కు వెయిట్ లిఫ్టింగ్ కార్యదర్శి రామయ్య తదితరులు అభినందించారు.

క్యూ కట్టిన కంటైనర్లు



జాతీయ రహదారిపై విశాఖ నుంచి కోల్‌కతా వెళ్తున్న 21 కంటైనర్లు క్యూ కట్టాయి. మండలంలోని గుండువల్లిపేట సమీపంలో బుధవారం వరుసగా ఆగడంతో రైలు బోగీలను తలపించాయి. ఈ కంటైనర్లను స్థానికులు ఆసక్తిగా చూశారు. ఇవి రక్షణ విభాగానికి చెందినగా భావిస్తున్నారు. - నరసన్నపేట